క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో చేరిన గొట్టిపాడు టీడీపీ నాయకులు



ప్రత్తిపాడు: మేజర్ గ్రామ పంచాయతీ పెదగొట్టిపాడులో టీడీపీకి గట్టి ఝలక్ తగిలింది. పంచాయతీ ఎన్నికల్లో అత్యంత కీలకంగా వ్యవహరించిన ఆ గ్రామ టీడీపీ ఉపసర్పంచ్ నిమ్మగడ్డ ముకుంద శివరంజని భర్త నిమ్మగడ్డ శ్రీకాంత్ సహా కొందరు టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. గుండె గుండెకు జగనన్న–గడప గడపకూ మన కిరణన్న కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి ప్రత్తిపాడు మండలం గొట్టిపాడులో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ పర్యటించారు. ఇందులో భాగంగా స్థానిక నాగార్జునసాగర్ కుడికాలువ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ గుంటుపల్లి వీరభుజంగరాయలు నివాసంలో బలసాని సమక్షంలో నిమ్మగడ్డ శ్రీకాంత్, గుంటుపల్లి రమేష్, పాముదుర్తి శ్రీనివాసరావు మరికొందరు టీడీపీ శ్రేణులు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి బలసాని పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోనికి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎంపీటీసీ మాజీ సభ్యులు మన్నవ మహేంద్ర, కవిత, మాజీ సర్పంచ్ దయారత్నం పాల్గొన్నారు. గ్రామంలో గడపగడపకూ వెళ్లిన సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన వెంట ఎంపీటీసీ బూసి సూవార్తమ్మ ఉన్నారు.

కనుల పండువగా రాజశ్యామల మహాయజ్ఞం

గుంటూరు రూరల్: లోక కళ్యాణార్థం రాజశ్యామల మహాయజ్ఞాన్ని హైదరాబాద్ గచ్చిబౌలికు చెందిన భవతరిణి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహాయజ్ఞం నిర్వహణ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో శనివారం ఏటుకూరు సమీపంలోని కామేశ్వరరావు గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన యజ్ఞంలో నగరంలోని ప్రజలు, ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు వేలాదిగా పాల్గొన్నా రు. ఉదయం 4 గంటలకు ప్రత్యేక పూజలతో మహా యజ్ఞం ప్రారంభించారు. భద్రకాళీ పీఠాధీశ్వరి సింధూ మాతాజీ ముఖ్య అతిథిగా పాల్గొని యజ్ఞక్రతువు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహదాశీర్వచనం చేశారు. భద్రకాళి, కాలభైరవ వీరఖడ్గ ప్రదర్శన, వీరాంగ విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. నిర్వహణ కమిటీ సభ్యులు దాసరి ప్రసాద్, మాజేటి గోపాలకృష్ణ, బందారు సాంబశివరావు, ఎం.గౌరిశంకర్, ఎం.సతీష్‌కుమార్, టి.శేఖర్ పాల్గొన్నారు.

అక్షరాస్యత ద్వారానే అభివృద్ధి

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- సుద్దపల్లిలో రూ.2కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



గోదాము ప్రారంభించి, మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట రోశయ్య



సుద్దపల్లి ఎంపీపీ పాఠశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట రోశయ్య

సుద్దపల్లి(చేబ్రోలు): అక్షరాస్యత ద్వారానే అభివృద్ధి సాధ్యమనే ధ్యేయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయిస్తున్నట్లు పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలు మండలం సుద్దపల్లిలో శనివారం వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.60లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. అదేవిధంగా సుద్దపల్లి దళితవాడలో రూ.16లక్షల వ్యయంతో ప్రాథమిక పాఠశాల ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. గ్రామంలో వేజండ్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో రూ.46లక్షల నాబార్డు నిధులతో బహుళ ప్రయోజన గోదామును ఎమ్మెల్యే ప్రారంభించారు. వీటితో పాటు చర్చి ప్రాంతంలో రూ.19లక్షల వ్యయంతో సిమెంటు రహదారి, దళితవాడ ప్రాంతంలో రూ. 50లక్షల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్లు, ముస్లిం ఏరియాలో రూ.10లక్షల వ్యయంతో సిమెంటు రహదారిని ఎమ్మెల్యే కిలారి గ్రామస్తులు, పార్టీ శ్రేణుల హర్షాతిరేకాల మధ్య ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా సుద్దపల్లి గ్రామంలో రూ.కోటితో పాఠశాలలు అభివృద్ధి చేస్తున్నామన్నారు. అదేవిధంగా రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అన్నదాతకు విత్తనం నాటిన దగ్గర నుంచి పంట పండించి గిట్టుబాటు ధర లభించే వరకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఆయాచోట్ల జరిగిన కార్యక్రమాల్లో సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, జీడీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, పొన్నూరు ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరావు, పెదకాకాని ఎంపీపీ టి.శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ కోట శ్రీనివాసరావు, ఎంపీటీసీ ఎం.వెంకటేశ్వరరావు, ఎంఈఓలు ప్రసాద్, సుబ్బారావు, విద్యాకమిటీ చైర్మన్ ఎస్.గోపి, సొసైటీ సీఈఓ షేక్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ఇంటింటికీ సంక్షేమం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్
- వట్టిచెరుకూరు మండలంలో 'ఆసరా' సంబరాలు



డ్వాక్రా మహిళలకు ఆసరా మెగా చెక్కు అందజేస్తున్న బలసాని కిరణ్‌కుమార్

ప్రత్తిపాడు: కులమతాలు, పార్టీలకు అతీతంగా నవరత్నాలతో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. వట్టిచెరుకూరులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో ఆసరా సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బలసాని కిరణ్‌కుమార్ స్వయం సహాయక సంఘాల సభ్యులకు నాల్గవ విడత ఆసరా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస రా ద్వారా నియోజకవర్గంలో వేలాది డ్వాక్రా అక్కచెల్లెమ్మల ఇళ్లలో ఆర్థిక వెలుగులు ప్రకాశిస్తున్నాయన్నారు. మండలంలోని 996 స్వయం సహాయక సంఘాలకు నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.8.96 కోట్ల మెగా చెక్కును అందజేశారు. అనంతరం మహిళలు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ చిలకా రాజ్యం, జెడ్పీటీసీ భీమినేని వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అన్నదాతలకు ఆపద్బాంధవుడిగా..!

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ చొరవతో గుంటూరు ఛానల్‌లో గుర్రపుడెక్క తొలగింపు, పూడికతీత



నాడు: మూడు రోజుల ముందువరకు విపరీతంగా పెరిగిన గుర్రపు డెక్కతో గుంటూరు ఛానల్



నేడు: గుర్రపుడెక్క తొలగించిన తరువాత సాఫీగా ముందుకు పారుతున్న నీరు

- శివారు భూములకూ అందుతున్న నీరు
- ఆరు గ్రామాల్లో నాలుగు వేల ఎకరాలకు సాగునీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



గుంటూరు ఛానల్‌లో పొక్లెయిన్‌తో గుర్రపు డెక్క తొలగిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు: అన్నదాతల శ్రేయస్సుకు వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ చూపిన చొరవ కారణంగా వేల ఎకరాలు సస్యశ్యామలమయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఇటీవల విరుచుకు పడిన తుపాను ప్రభావంతో ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు మండలాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోవలసి వచ్చింది. చేతికి రాదనుకున్న పంటను రైతాంగం నానా తిప్పలు పడి కొంతమేర కాపాడుకోగలిగింది. తీరా దిగుబడులు చేతికొచ్చే సమయంలో వ రుణుడు ముఖం చాటేయడంతో పాటు ప్రభుత్వం విడుదల చేసిన సాగునీరు గుంటూరు ఛానల్ కాలు వ గుర్రపు డెక్కతో పూడిపోయి, ఆయకట్టు చివరి భూములకు నీరు అందని పరిస్థితి ఏర్పడింది.

బలసాని దృష్టికి సమస్య..

ఈ నేపథ్యంలో వట్టిచెరుకూరు మండలంలో పర్యటనకు వెళ్లిన సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్‌ను కలిసిన వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలాల రైతులు సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కాలువ మొత్తం గుర్రపు డెక్కతో నిండిపోయి, పూడిపోయి సాగునీరు టెయిల్ ఎండ్ వరకు రావడం లేదని వాపోయారు. దిగుబడులు చేతికి వచ్చే సమయంలో నీరు అందకపోతే పంట చేతికి రాదని వివరించారు.

సత్వర స్పందన.. హై స్పీడ్ వేగంతో నీళ్లు..

రైతులు చెప్పిన సమస్యపై బలసాని తక్షణమే స్పందించారు. రెండు పొక్లెయిన్లతో వింజనంపాడు నుంచి గారపాడు టెయిల్‌ఎండ్ వరకు యుద్ధ ప్రాతిపదికన గుర్రపు డెక్కను తొలగింపు, పూడికతీత ఏడు కిలోమీటర్ల మేర పనులను చేయించారు. కేవలం మూడే మూడు రోజుల్లో చివరి భూములకు హైస్పీడుతో నీళ్లు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. దీంతో వట్టిచెరుకూరు మండలం పల్లపాడు, యామర్రు, సొనాడు, గారపాడు, చింతపల్లిపాడు, కుర్నూతల, ప్రత్తిపాడు మండలం కొండేపాడు, కొత్తమల్లాయపాలెం గ్రామాల్లో సాగులో ఉన్న సుమారు నాలుగు వేల ఎకరాలకు నీరు అందుతోంది. దీంతో రైతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

సత్వరమే స్పందించారు



రైతులు సమస్యను చెప్పిన వెంటనే కిరణ్‌కుమార్ సానుకూలంగా స్పందించారు. పూడికతీత పనులను ప్రారంభించి, మూడే మూడు రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. రైతుల సమస్యలపై ఇంత త్వరగా స్పందించడం శుభపరిణామం. పూడికతీత అనంతరం రైతులకు హైస్పీడులో నీరు అందుతుంది.

– నర్రా రాంబాబు, సర్పంచ్, కొండేపాడు, ప్రత్తిపాడు మండలం

నీళ్లు రావనుకున్న తరుణంలో..



గుంటూరు ఛానల్‌లో పుష్కలంగా నీరు ఉన్నా.. విపరీతంగా పెరిగిన గుర్రపు డెక్కతో చివరి భూములకు సాగునీరు అందని పరిస్థితి. ఇక నీరు అందదని, మళ్లీ చేతికొచ్చిన పంట దక్కదనుకున్న తరుణంలో చివరి ప్రయత్నంగా సమన్వయకర్త బలసానికి సమస్యను వివరించాం. ఆయన ఎంతో వేగంగా స్పందించి పంటలకు జీవం పోశారు. రైతులు పడుతున్న బాధలకు చెక్ పెట్టారు.

– కుందూరి లక్ష్మారెడ్డి, సర్పంచ్, కొత్తమల్లాయపాలెం

మరోసారి నష్టపోవాల్సి వచ్చేది



గుర్రపు డెక్క తొలగించకపోయి ఉంటే సాగునీరు అందేది కాదు. గుర్రపు డెక్క తొలగించడం వలన దాదాపుగా ఏడెనిమిది గ్రామాల రైతులకు సాగునీరు అందింది. రైతులు సమస్య చెప్పినప్పుడు, వెంటనే స్పందించకుంటే కర్షకులు ఎంతగానో నష్టపోవాల్సి వచ్చేది. కనీసం పెట్టుబడులు కూడా వచ్చేవి కావు. పూడికతీతతోనే రైతుల పొలాలకు నీరు అంది పంటను తడుపుకొంటున్నారు. – ఎస్.రాజశేఖర్‌రెడ్డి, రైతు, సొపాడు, వట్టిచెరుకూరు మండలం